క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరులో గురువారం పర్యటించనున్నారని ఎంపీడీఓ నగేష్ కుమారి బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రేప్లాంట్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్లను ప్రారంభిస్తారని చెప్పారు. మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సింహపురిలో 'బిచ్చగాడు'



నెల్లూరు సిటీ: నగరంలోని ఎం–1 థియేటర్స్‌లో బిచ్చగాడు హీరో విజయ్ ఆంటోనీ బుధవారం సందడి చేశారు. ప్రేక్షకులతో ముచ్చటించారు. బిచ్చగాడు–3ను సైతం నిర్మించనున్నామని తెలిపారు. తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విజయ్ ఆంటోనీతో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఎగబడ్డారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలికి గాయాలు

నెల్లూరు సిటీ: బైక్‌పై నుంచి పడడంతో వృద్ధురాలు గాయపడిన ఘటన నగరంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నవలాకులతోటకు చెందిన జయలక్ష్మి తన మనవడితో కలిసి బైక్‌పై గూడూరులోని బంధువుల ఇంటికి బుధవారం వెళ్లారు. తిరిగొస్తుండగా, బాలాజీ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌పై నుంచి కిందపడ్డారు. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై వాహనాల ఢీ

నెల్లూరు సిటీ: జాతీయ రహదారిపై వాహనాలు ఢీకొన్న ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లాకు చెందిన ఆరిపుల్లా సహచరులతో కలిసి కంపెనీ పని నిమిత్తం విజయవాడ నుంచి కుప్పానికి ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. ఈ క్రమంలో ఎన్టీఆర్‌నగర్‌లోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై బస్సు వెనుక భాగాన్ని ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ ఢీకొంది. దీంతో బస్సు, లారీని పక్కన నిలిపి డ్యామేజీపై లారీ డ్రైవర్‌తో ఆరిపుల్లా మాట్లాడసాగారు. ఈ క్రమంలో మరో లారీ ఈ వాహనాలను ఢీకొంది. దీంతో ఆరిపుల్లాపైకి బస్సు రావడంతో స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని సర్వోదయ కళాశాల మైదానంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సర్వోదయ కళాశాల మైదానంలో స్థానికులు వాకింగ్ చేస్తుండగా, గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడికి 60 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ రంగుపై తెల్లనక్షత్రాలు కలిగిన లుంగీని ధరించి ఉన్నారు. చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న బాలరామాయణ సప్తాహం



నెల్లూరు(బృందావనం): నైతిక విలువలకు పునాది శతక సాహిత్యమేనని కవి, పండితోపన్యాసకుడు శిరోమణిశర్మ పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్‌కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో బాలరామాయణం, నామరామాయణ సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. అరణ్యకాండ, దాశరథి శతకంలోని శ్లోకాలను ఆలపించి, బాలలతో వల్లె వేయించారు. శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్డు నిర్మించాలని వినతి

నెల్లూరు రూరల్: పెద్దచెరుకూరు నుంచి తోటపల్లిగూడూరు మండలంలోని చిన్న చెరుకూరుకు లింక్ రోడ్డు నిర్మించాలని ఆయా ప్రాంతాల వారు కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. లింక్‌రోడ్డు సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- చెర్లోపల్లిలో రూ.2.52 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. తొలుత స్థానిక నాయకులు చేడిమాల బుజ్జిరెడ్డి, రమణకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో ఆహ్వానం పలికారు. అనంతరం రూ.2.52 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను మంత్రి ప్రారంభించారు. ఆ తరువాత గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ నేటితో సర్వేపల్లి నియోజకవర్గంలోని 89 సచివాలయాలకు గానూ 88 సచివాలయాల పరిధిలో గడప గడపకు పూర్తి చేశామన్నారు. గడప గడపకు కార్యక్రమాన్ని సంపూర్ణంగా సమగ్రంగా పూర్తి చేసేందుకు సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమయ్యేదన్నారు. దీనికి భిన్నంగా తాము ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడమే కాకుండా పనులు పూర్తి చేసి చూపుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో శిలాఫలకాలు వేసి వదిలేసిన పనులను సైతం తాము పూర్తి చేస్తున్నామన్నారు. దేశంలో రూ.2750 పింఛన్ నగదు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ తప్ప మరొకటి లేదన్నారు. గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లు..ఇలా రాష్ట్రంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేసిన చరిత్ర స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరివేర్చి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లేలా చేసిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీపీ వజ్రమ్మ, తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్, హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, జేడీ సుధాకర్‌రాజు ఏఓ జహీర్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ కార్తీక్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల సుధీర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మహేంద్రవర్మ, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల, చేపల ఊరగాయలపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీ విజయ్

ఇందుకూరుపేట: సేవ్ ది చిల్డ్రన్ ఆధ్వర్యంలో మండలంలోని మైపాడులో చేపలు, రొయ్యల ఊరగాయల తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. మత్స్యశాఖ ఏడీ విజయ్ మహిళలకు ఊరగాయల తయారీతో పాటు చేపలను ఎండబెట్టు విధానాన్ని తెలియజేశారు. ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సురేష్, వీఎఫ్ఓ పర్వేజ్, ఎంపీటీసీ రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొలక పోలేరమ్మ గ్రామోత్సవం



విశేషాలంకారంలో మొలకపోలేరమ్మ



విశేషాలంకారంలో గంగమ్మ

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో మొలకపోలేరమ్మ, గంగమ్మ గ్రామోత్సవాన్ని మంగళవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. మొలకపోలేరమ్మ జాతరలో భాగంగా ఇరువురు అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఇరువురు అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.

వేసవి విజ్ఞాన శిబిరం పరిశీలన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అధికారులు

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఈఓ జీ వసంతకుమారి, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞాన పెంపొందుతుందన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానంతో పాటు పాటు తెలుగు భాష ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వేసవిలో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. వారి వెంట గ్రంథాలయాధికారి జే సురేంద్రరెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలి



ఆరోగ్య సిబ్బందితో మాట్లడుతున్న జేసీ కూర్మనాథ్

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు–2 సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఐదు సచివాలయాలను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. అందులో భాగంగా వవ్వేరు–2 సచివాలయాన్ని తనిఖీ చేశామని తెలిపారు. జూలై 15లోగా గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా లబ్ధిదారులు, కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ గృహ నిర్మాణాల పురోగతిని సచివాలయ ఉద్యోగులు పరిశీలించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయాలన్ని పాటించాలన్నారు. అర్జీదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చొరవచూపాలన్నారు. ఎండలకు ప్రజలు వడదెబ్బకు గురవకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. రీ సర్వేపై సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సుధీర్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ కింద రూ.17.30 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శర్మ

పొదలకూరు : మండలానికి జలజీవన్ మిషన్ ద్వారా రూ.17.30 కోట్లు మంజూరైనట్లు ఆ మిషన్ కోఆర్డినేటర్ శర్మ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జలజీవన్ మిషన్‌పై సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పొదలకూరుకు ప్రత్యేకంగా పైపులైన్ నిర్మాణం చేపట్టి కండలేరు జలాలను సరఫరా చేస్తామన్నారు. గ్రామాల్లోనే మంచినీటి పరీక్షలు చేసుకునేందుకు వీలుగా ప్రతి సచివాలయానికి ఫీల్డ్‌టెస్టింగ్ కిట్లను అందజేశామని తెలిపారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు మంచినీటి పరీక్షలు నిర్వహించి తేడాలు ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ నగేష్‌కుమారి నాడు–నేడు, వైఎస్సార్‌క్రాంతి పథం, ఎన్ఆర్ఈజీఎస్, గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కే కనకనాయక్, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, మండలాధికారులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి చందనాలంకారం



చందనాలంకారంలో వీరాంజనేయస్వామి.

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెవి వినికిడి యంత్రాల పంపిణీ



చెవి వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని మునునూరువారిపాళెంలో పేదలకు చెవి వినికిడి యంత్రాలను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో శ్రీరాగప్రణీత స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ సహకారంతో సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ యంత్రాలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు ఆల్బర్ట్, కామేశ్వరావు, రామకృష్ణ, అపోలో సిబ్బంది, స్థానికులు సుధీర్‌రెడ్డి, నడవడి అశోక్‌గౌడ్, సచివాలయ కన్వీనర్ పఠాన్ సుభాన్, రమణ, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి నూతన భవనం



దివ్యాంగ బాలురకు ఆట వస్తువులు అందజేస్తున్న డీఈఓ గంగాభవాని

ముత్తుకూరు: ముత్తుకూరులోని భవిత కేంద్రానికి నూతన శాశ్వత భవన నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నామని డీఈఓ గంగాభవాని, జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని బుధవారం వారు పరిశీలించారు. ప్రత్యేకావసరాల పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటపాళెంలోని ఓ పామాయిల్ ఫ్యాక్టరీ సీఎస్సార్ నిధులతో భవిత కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిందన్నారు. నూతన భవనానికి సరిపోయే స్థలాన్ని ఎంపిక చేయాల్సి ఉందన్నారు. స్థల సేకరణ పూర్తయి వెంటనే నూతన భవన నిర్మాణం మొదలవుతుందని తెలిపారు.

రూ.6.75 కోట్లతో తారురోడ్డు నిర్మాణం



పొదుపు మహిళలకు చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మండలంలోని చాయప్పనగర్ నుంచి అల్లూరురోడ్డు వరకు పది కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.6.75 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. యల్లాయపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాయప్పనగర్ నుంచి బొడ్డువారిపాళెం , గువ్వగుంట, గుంటకట్ట, రైల్వేస్టేషన్, వడ్డిపాళెం, కోనంపాడు, బీసీ కాలనీ, తలమంచి, కొండాయపాళెం గ్రామాలను కలుపుతూ అల్లూరు రోడ్డు వరకు 10 కి.మీ మేర తారు రోడ్డు నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాహనదారుల సమస్యను దృష్టిలో పెట్టుకుని తాను ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆయన పొదుపు గ్రూపు సభ్యులకు రూ.1.10 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీ చేశారు. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీఎం రుణాల మంజూరుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7,258 గృహాలను సందర్శించామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేలా రూపొందించిన గడప గడపకు కార్యక్రమం ఒక బృహత్తర కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడా ఎమ్మెల్యేలు ప్రతి గడపకు వెళ్లడం ఇప్పటి వరకు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన గడప గడపకు కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమాదేవి, ఎంఈఓ వసంతకుమారి, ఎంపీపీ జీ జ్యోతి, ఏపీఎం ఎస్ రుక్మిణి, నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, కే వెంకటరమణారెడ్డి, తాటిపర్తి భాస్కర్, దేవిరెడ్డి సాయిరెడ్డి, మల్లి కిషోర్‌రెడ్డి, మాబాషా, టీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్చుకుంటేనే మనుగడ

- కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్



పంటపాళెంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న దృశ్యం

ముత్తుకూరు : జీవనశైలిని మార్చుకుంటేనే భవిష్యత్తులో మనుగడ సాధ్యమవుతుందని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్ అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా పంటపాళెంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు 75 అంశాల్లో జీవనశైలిని మార్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన అవసరం అవసరమన్నారు. 2028 వరకు దేశంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వ్యర్థ రసాయనాలతో మనిషి ఉనికికే ముప్పు ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయమంటూ పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు ప్రతిజ్ఞ చేశారు. కృష్ణపట్నం ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత చేపట్టారు. స్థానిక సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ప్రభాకరనాయుడు, ఎనిమిది ఫ్యాక్టరీల మేనేజర్లు నారాయణమూర్తి, వరప్రసాద్, విశాల్‌జైన్, గణేష్, చంద్రమౌళి, యోగానంద, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 84 గ్రామాల్లో స్వామిత్వ పూర్తి

- డీపీఓ సుస్మితరెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ సుస్మితరెడ్డి

మనుబోలు: జిల్లాలోని 84 గ్రామాల్లో స్వామిత్వను ఇప్పటి వరకు పూర్తి చేశామని డీపీఓ సుస్మితరెడ్డి తెలిపారు. మనుబోలులోని రెండు సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 722 పంచాయతీల్లో 590 పంచాయతీల్లో స్వామిత్వను ప్రారంభించామని తెలిపారు. తొలివిడతలో 84 గ్రామాల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. 32 గ్రామాల్లో డ్రోన్లతో ఇంటి హద్దులను సర్వే చేసి గుర్తించి వాళ్ల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. యూనిక్ కోడ్లతో రిజిష్టర్ చేసి కార్డులు ఇస్తామని తెలిపారు. ప్రతిరోజూ సచివాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె వెంట సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

చిన్నారి మృతిపై విచారణ



రామచంద్రాపురంలో విచారణ చేపడుతున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని సన్‌షైన్ ఆస్పత్రిలో వైద్యం వికటించి చిన్నారి మృతి చెందిన ఘటనపై జిల్లా నోడల్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్ బుధవారం విచారణ చేపట్టారు. వివరాలు..దగదర్తికి చెందిన రాధాకృష్ణయ్య, కవిత దంపతులు. వారి నాలుగేళ్ల కుమార్తె తన్విశ్రీ ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం మండలం రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న తాత ఇంటికి వచ్చింది. ఈ నెల 23న పాపకు కడుపు నొప్పి రాగా సన్‌షైన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యుడు సుబ్బారెడ్డి వైద్యపరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపించారు. కొద్దిసేపటి తర్వాత పాపకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్ సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది కలిసి పాపకు ఇంజక్షన్లు, సెలైన్లు ఇచ్చారు. దీంతో చిన్నారి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన ఆస్పత్రి సిబ్బంది డాక్టర్‌కు విషయం తెలుపగా వారు హుటాహుటిన చిన్నారి తల్లిదండ్రుల సహకారంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పాపను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై నోడల్ ఆఫీసర్ రామ చంద్రాపురం చిన్నారి కుటుంబ సభ్యులను విచారించారు. మోతాదుకు మించి ఇంజక్షన్లు, సెలైన్లు ఇవ్వడం వల్లే వైద్యం వికటించి చిన్నారి మృతి చెందినట్లుగా విచారణలో తేలిందని ఆయన చెప్పారు. డాక్టర్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఆయన వెంట కావలి డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత, జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్‌బాబు, తదితరులు ఉన్నారు.

ఆక్రమిత శ్మశాన భూమి స్వాధీనం



శ్మశానాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీని జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు:ఓ రియాల్టర్ ఆక్రమించిన శ్మశాన భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం పంచాయతీలకు సంబంధించి పోలీస్‌స్టేషన్ ఎదురుగా 441ఏ సర్వే నంబర్‌లో 3.91 ఎకరాల శ్మశాన స్థలం ఉంది. ఈ భూమిని అనుకుని ఉన్న సర్వే నంబరు 446లోని 3.70 ఎకరాల్లో ఇటీవల సురేంద్ర అనే వ్యక్తి లేఅవుట్ వేశాడు. ఈ క్రమంలో శ్మశానానికి చెందిన 87 సెంట్లను తన లేఅవుట్‌లో కలుపుకొని ప్రహరీ నిర్మించాడు. లేఅవుట్‌లో ప్లాట్లను ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించాడు. శ్మశానం ఆక్రమణ విషయాన్ని తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం పంచాయతీలకు చెందిన పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు ఇచ్చారు. ఆక్రమణలోని శ్మశాన భూమిని వెంటనే విడిచిపెట్టాలని హెచ్చరించారు. అయినా అతని నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్య, ఆర్ఐ సునీల్ తమ సిబ్బందితో కలిసి బుధవారం వెంచర్ వద్దకు వెళ్లారు. ప్రహరీని జేసీబీతో ధ్వంసం చేసి శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.